# అవినీతికి అటూ ఇటూ

■ డాక్టర్ పులిపాటి గురుస్వామి

బికామ్ చదివిన నేను ప్యూన్ ఉద్యోగానికి దరఖాస్తు పెట్టాను. ఇంటర్వ్యూకు పిలిచారు. నేషనల్, ఇంటర్‌నేషనల్ రాజకీయాల గురించి ప్యూన్లకు అవసరం లేకపోయినా, అడిగితే చెప్పాను. బహుశా నన్ను పరీక్షించడానికి కాబోలు, కాఫీలు తెచ్చిస్తూ, ఫైళ్ళను కావాల్సిన చోటుకు చేరవేసే వృత్తికి కరెంటు అఫైర్సు అవసరమెంతో అర్థం కాకపోయినా అవీ అడిగితే చెప్పాను. ఆఫీసర్లు ముఖాలు చూసుకున్నారు. 'ఇంత తెలివి కలవాడివి, డిగ్రీ చదివినవాడివి ప్యూన్ ఉద్యోగం ఎలా చేస్తావ్' అన్నారు అధికార్లు.

"ఏ హోదాలోనైనా అంతర్లీనంగా ఉండేది 'శ్రమే కదా' అన్నాను. నా మాటకు సంతృప్తిపడ్డారు. తెలివి కలవాడినిగా వాళ్ళు అభినందించారు. అంతమాత్రాన ఉద్యోగమిచ్చారనుకున్నారా! ఈ రోజుల్లో డబ్బులు ముట్టుకోకుండా పని చేస్తున్న అధికారులు ఎక్కడున్నారు చెప్పండి. ఆఫీసరు ఇంటికి యాభై వేలు పంపితేగాని ఇవ్వలేదు.

వీడికేమైనా పిచ్చిపట్టిందా అని మీరనుకోవచ్చు- డిగ్రీ చదివిన నేను ప్యూన్ ఉద్యోగాన్ని కోరి మరీ డబ్బులిచ్చి పొందడమేమిటని! కానీ, నాకు రాజాలా బతకాలని ఉంటుంది. ప్యూన్ ఉద్యోగంతో రాజాలా ఎలా బతుకుతానని మీకు అనుమానం రావటం సహజమే. ఎందుకంటే, గుమస్తాగిరి చేసేవానికి ఓ పెద్ద బిల్డింగ్ ఉందనుకోండి. ఆ వెనుక మన అనుమానం మనల్ని తొలిచేయడం సహజమే కదా!

పెద్ద బిల్డింగుల్లో కార్పెట్ల పైన నడక, షాండ్లియర్ల వెలుతుర్లో విస్కీ చుక్కలు చప్పరిస్తూ, భార్యల్ని వదిలి ఇతర స్త్రీల శరీరాల్ని తడుముతూ, అందినంత ఇనుప బీరువాల్లోకి నెట్టేస్తూ, కార్లలో తిరుగుతూ, ఏసీ గదుల్లో ఊపిరి తీసుకోవడమే రాజాలా బతకడమంటే నేను ఒప్పుకోను.

కుటుంబ సభ్యులందరికీ సమయానికి తగిన ఆహారమూ, విహారమూ, పిల్లల చదువూ భవిష్యత్తు, ఆపదలో ఉన్నానని ఎవరైనా వస్తే చేతనైన సాయం చేయగల మానవతా దృష్టి- ఇలా కొనసాగించగల బతుకు రాజా బతుకని నా అభిప్రాయం.

ఈ అభిప్రాయానికి వీసమెత్తు కూడా వెనక్కి జరక్కుండా నా ప్యూన్ ఉద్యోగంతో బతకగలనన్న నమ్మకం నన్ను పెద్దపెద్ద ఉద్యోగాలకు ఉసి గొల్పలేదు.

నా పెళ్ళి సందర్భంలో కూడా ఈ మాటల్ని ఇంటర్ చదివిన నా భార్యకు విన్నవించాను. సభ్య సమాజంలో నా భర్త ప్యూన్ అని చెప్పుకోగల్గిన ధైర్యముంటేనే పెళ్ళికి అడుగేయమన్నాను. ఎందుకన్నానంటారా! అమ్మాయిల్ని సంతలోకి పశువులని పంపినట్టు మూతికి తాళం వేసి కట్టబెట్టడం మన ఇళ్ళల్లో చేస్తున్న పనే కదా! ఆ తర్వాత కలలాగా మిగిలిపోయిన వారి ఆశలను, ఆశయాలను తలుచుకుంటూ కళ్ళు మూసుకొని సంసారాలు చేయటం తెలుస్తున్న సంగతులు కనుక అవేమీ నాకు ఇష్టం లేదు.

నాకు పోయిన మా నాన్నగారు సంపాదించిన ఇల్లుంది. మా అమ్మ, భార్య, ఒకే కొడుకు- మరో పదిమంది అతిథులొచ్చినా సరిపోగల ఇల్లు కాకుండా, రెండు చిన్న కుటుంబాలు నివసించగల ఇల్లు అద్దెకిచ్చాం. ఎక్కువ పీడించకుండా న్యాయబద్ధంగా అద్దెకున్న రెండు కుటుంబాల నుండి తీసుకుంటున్న వెయ్యి రూపాయలు, నా ప్యూన్ జీతమూ కలిపి నేను రాజాలాగా బతకగలననుకున్నాను.

ఆఫీసులో చేరిన కొత్తలో తమతో సమానంగా చదివినవాడినని క్లర్కులు కొందరు ఆప్యాయంగా, ఆదరంగా చూసినవారున్నారు. తమతో కూచోబెట్టుకున్నారు. టీలు తెచ్చేవాన్ని. టీ కప్పులు తీసేవాన్ని. కలిసి తాగేవాళ్ళం. కలిసి తినేవాళ్ళం. ఒకే టేబుల్‌కు ఎదురెదురుగా కూర్చొని నాతో అకౌంట్లు రాయించుకున్న సందర్భాలూ ఉన్నాయి. అలా అని నేనే కావాలని తిరిగేవాణ్ణి కాదు సుమా! ఆఫీసు గేటు బయట స్టూలు నా సింహాసనం. ఎవరు పిల్చినా పోతాను. నాతో కలిసే క్లర్కులతో ఎంత కలివిడిగా ఉంటానో స్వీపరూ, వాచ్‌మన్‌లతో అంతే కలివిడిగా ఉంటాను. అది నాకు చాలా ఆనందాన్నిస్తుంది.

అనవసరంగా కావాలని ఏ సమస్యలోనూ తల దూర్చకపోవడం, ఎవరి మనసునూ నొప్పించకపోవటం నా నైజం. నా వృత్తి రీత్యా కూడా ఈ స్వభావం అందరిలో ఒకడిగా మెలిగేలా చేసింది. మరో విషయమేమిటంటే, ఎవరు ఏ విషయం చెప్పినా శ్రద్ధగా వింటాను. సలహాలు చెప్పే అలవాటు నాకు లేదు. అందుకే నేను ఎల్లవేళలా శ్రోతను మాత్రమే.

మనుషులకో గొప్ప వైచిత్రి ఉంది- మన సమస్యలు విని సలహాలు చెప్పేవాణ్ణి దూరంగా ఉంచడం- మళ్ళీ రెండోసారి వానికి చెప్పకపోవడం. ఈ చిత్రమైన వైవిధ్యాన్ని గమనించే నేను ఎవరికీ సలహాలు చెప్పకపోవడం వల్ల అందరికీ నేను శ్రోతగానే మిగిలిపోయాను. నాతో ఈ ఆఫీసువాళ్ళు ఫామిలీ విషయాల దగ్గర్నుండీ ఆత్మీయంగా చెప్పుకునేవారు. వాళ్ళ ఇళ్ళల్లో పార్టీలకూ పిలిచేవారు.

నాకు ఖాళీ సమయం చాలా దొరికేది. వేస్ట్ వృథా చేయక పోస్ట్ గ్రాడ్యుయేషన్ కూడా పూర్తి చేశాను. ఈ విషయాన్ని మాత్రం నేను ఆఫీసులో ఎవరికీ చెప్పలేదు. నన్ను దూరంగా ఉంచే కొందరికి ఈ విషయం మింగుడుపడకపోవచ్చు. మనకంటే తక్కువ హోదాలో ఉన్నవాడు ఎక్కువ చదువుకున్నవాడైతే మనసు తట్టుకోలేదు. ఆ అనిశ్చిత స్థితిలో వాణ్ణి ఏ సందర్భంలో అవమానిద్దామా అని ఎదురుచూస్తుంటాం.

ఒకసారి ఆఫీసుకు కొత్త క్లర్కు బదలీపై వచ్చాడు. యథావిధిగా లంచ్ టైమ్‌లో అందరితో కలిసి భోంచేయడం అతనికి కోపం తెప్పించింది. ఎక్కడ ఉండేవాళ్ళు అక్కడ ఉంటేనే బావుంటుందన్నాడు. అతను నా కంటే తక్కువ డిగ్రీతో ఎక్కువ హోదాలో ఉన్నాడు. అతని కంటే ఎక్కువ డిగ్రీతో ఉన్నా తక్కువ హోదాలో నేనున్నాను మరి! అయినా, ప్యూన్ అనేవాడు తప్పనిసరిగా ఆఫీస్ అవతల గ్రౌండులోనో, డాబామీదనో, స్టోర్ రూమ్‌లోనో తినాలా! మనిషిలా, మనుషుల మధ్య తినడంలో తిరిగిపోయే హోదా గురించి ఆలోచిస్తూ అతన్ని జాలిగా మాత్రమే చూశాను.

"ఏమిరా! కొడతావా? అట్లా చూస్తున్నావ్" అన్నాడు.

అక్కడి నుండి నేను తప్పుకున్నాను. అతన్ని కొందరు శాంతపరిచారట. మా సూపరింటెండెంటుకు అతను ఫిర్యాదు చేశాడు. అది ఆయన్ను ఆశ్చర్యపరచింది. సూపరింటెండెంటు కంటే ముందు నుంచే నేను ఆ ఆఫీసులో ఉన్నాను. నాపై ఫిర్యాదు లేవీ అతను చూళ్ళేదు. ఆమాటకొస్తే ఎవరూ చూళ్ళేదు.

తక్కువ హోదాలో ఉన్నవాడు తమతో సమానంగా తిరగటం కొందరికి అవమానంగా ఉంటుంది కాబోలు. దాన్ని తట్టుకోలేక అతనిపై అరవటమో లేక మరేవిధంగానో తప్పులో ఇరికించి తమ ఆధిపత్యాన్ని నిరూపించుకోవటానికి కొందరు తంటాలు పడుతుంటారు. సరిగ్గా అలాంటివాడే ఇతనూ. నేనతన్ని పట్టించుకోవటం మానివేశాను.

నేను ఉద్యోగంలో చేరి పది సంవత్సరాలైంది. చాలామంది స్టాఫ్ బదలీపై వచ్చారు, వెళ్ళారు. నేను మాత్రం ఎక్కడికీ వెళ్ళలేదు. ఆఫీసర్లు ముగ్గురు మారారు. వారందరికీ నేను అణకువగానే ఉన్నాను. ఒక ఆఫీసరు ఇంటికి కూరగాయలు మోశాను. ఒక ఆఫీసరుకి విస్కీ బాటిల్సు మోశాను. కావాల్సిన వంట సామగ్రి మోశాను. వాళ్ళకి నేను ప్యూన్‌గా మాత్రమే తెలుసు. డిగ్రీ చదివిన ప్యూన్‌గా తెలిస్తే చేయించకపోయేవారేమో! అయినా, నేనేం బాధపడలేదు. ప్యూన్ అనే అవతారానికి ఏ ఆఫీసులోనైనా తప్పని తిప్పలే కదా ఇవి.

ఇప్పుడు పనిచేస్తున్నది నా సర్వీసులో నాల్గవ ఆఫీసరు. ఒక పరిస్థితిలో నాకూ, ఆయనకూ చిన్న ఘర్షణ జరిగింది. ఆఫీసరంతటి వానితో ఘర్షణకు దిగే తెలివితక్కువ పని నేనేం చేయలేదు. న్యాయం గురించి మాట్లాడాను. ఆ ఒక్క ముక్క చాలదటండీ! తక్కువ హోదా వెధవ ఆఫీసరును న్యాయం గురించి అడిగితే అతని ప్రిస్టేజీ ఎంత దిగజారేను!

మసాలా బాగా దట్టించిన కూర తింటే కారం నాసాలానికంటుతుందంటారు చూడండి- నన్ను చూడగానే మా ఆఫీసరుకు అలా ఉంటుంది. 'నమస్తే సార్' అన్నప్పుడు కాగిన పెనంపై నీళ్ళు చల్లినప్పటి స్థితి ఆయన ముఖంపై కనిపిస్తుంది. రోజు రోజు నన్ను చూస్తూ గడపటం, నా చేత పని చేయించుకోవాల్సి రావటం ససేమిరా ఇష్టం లేకపోయింది. ఆఫీసులో జరిగిన ఓ సంఘటనే ఇందుకు కారణం.

ఆఫీసరు కుర్చీకి పైన కాకుండా హాలు మధ్యలో ఫ్యాన్ ఉండటంచే ఆఫీసరుగారికి గాలి తక్కువగా వచ్చేది. ఇంతకు ముందు పని చేసిన ఆఫీసర్లకు

చిత్రాలు: నర్సిం



కూడా అదే ఫ్యాన్‌తో అదే మోస్తరులో గాలి సరఫరా జరిగింది. ఈ ఆఫీసరుగారికేమో ఆ గాలి సరిపోక, ఆఫీసు డబ్బులతో ఓ కొత్త టేబుల్ ఫ్యాన్ కొని తన టేబుల్‌పై అమర్చు కున్నాడు. ఈ కార్యక్రమంపై ఆఫీసులో ఎవ్వరూ ఏమీ అనలేదు. ప్రజానాయకులు ప్రజల ధనం దుర్వినియోగపరుస్తుంటే ఎవరైనా అడుగుతున్నారండి! మా ఆఫీసు లోనూ అదే ప్రజాస్వామ్యం.

పదిహేను రోజుల తర్వాత పొద్దున్నే వచ్చిన నాకు ఫ్యాన్ కనిపించలేదు. ఎక్కడైనా పెట్టారేమోనని వెదికాను. లేదు. స్వీపరును, వాచ్‌మన్‌నూ ఆరా తీశాను. తెలియదన్నారు. నిన్న ఉండెనన్నారు. ఆందోళనపడ్డారు. అన్ని ప్రదేశాలూ వెతికారు. అన్నీ ఉండి ఒకే ఫ్యాన్ పోవడం ఆశ్చర్యం కలిగించింది.

ఆఫీసరు వచ్చాక విషయం తెలుసుకొని మండి పడ్డారు. మా అందరి ముఖాలపై ప్రశ్నార్థకం వేశారు. అందరూ తెలియదని పలికాం.

"ఏం చేస్తున్నారు మీరంతా? మీ ఇంట్లో అయితే ఇలాగే అజాగ్రత్తగా ఉంటారా! ఆఫీసు సొత్తంటే మనందరిదీ కాదా! ఇలా ఎన్ని పోతున్నాయో గమనించారా?" మండిపడుతూ ఎంక్వయిరీ చేయమని సూపరింటెండెంటుకు ఆజ్ఞ జారీ చేశారు.

ఆఫీసు రికార్డు తీసి, ఆఫీసులో మొత్తం ఉన్న బల్లలు, కుర్చీలు, ఇతర సామగ్రి గురించిన సమాచారాన్నంతా వెరిఫై చేశారు. అన్నీ ఉన్నాయి. కొత్తగా తెచ్చిన ఫ్యాన్ తప్ప.

మర్నాడు నన్ను ప్రత్యేకంగా పిలిచి, "ఎవరు చేసి ఉంటారోయ్" అన్నాడు. ఈ సంఘటన జరక్క ముందు దాకా సరదాగానే మాట్లాడేవాడు. "తెలియదు సార్" అన్నాను.

"ఏం తెలును మరి?"

అర్థం లేని ప్రశ్న అనిపించింది. మౌనంగా ఉన్నాను.

స్వీపరూ, వాచ్‌మన్‌ల గురించి అడిగాడు. చెప్పాను. వాళ్ళు ఫ్యాన్ దొంగిలించడమనే ఊహ నాకు అసహజంగా తోచింది. వారు నాకు చాలా ఏళ్ళుగా తెలుసు.

మూడవ రోజు నన్ను, నాతోపాటు స్వీపరును, వాచ్‌మన్‌ను పిలిచాడు. 'ఆఫీసు పరిరక్షణ బాధ్యత మీదే కాబట్టి జరిగిన నష్టాన్ని మీరు ముగ్గురూ భరించా'లన్నాడు.

నిజం చెప్తున్నాను. మన సమాజంలో బీదలూ, హోదా లేనివాళ్ళు, కూలీపనిచేసేవాళ్ళూ పక్కా దొంగలని, మోసగాళ్ళనీ చాలామంది గొప్పవాళ్ళ అభిప్రాయం. ఈ ఆఫీసరుకూ అలాంటి ఆలోచనే వచ్చి, "ఎలా జరిగినా మీరు ముగ్గురూ భరించ"మని తీర్పు చెప్పాడు.

అవునండీ! ప్యూన్‌లకూ, స్వీపర్లకూ, వాచ్‌మన్‌లకూ ఏ ఆఫీసులోనైనా పంఖాలు అమర్చిన దాఖలాలున్నాయా! ఊడ్చేటప్పుడో, చాయిలిచ్చేటప్పుడో, ఫైళ్ళు మార్చేటప్పుడో ఆఫీసు వాళ్ళకొచ్చే గాలికి అడ్డుతగలగా అంటేదే తప్ప మాకంటూ స్పెషల్ గాలి పంఖా లున్నాయండీ! ఆ అదృష్టం లేకపోయినా పోయిన ఫ్యాన్‌కు డబ్బులు కట్టాల్సి వచ్చిన దురదృష్టానికి బాధ కలిగింది.

ఆ మాట విన్న ఆఫీసు వాళ్ళంతా మా మీద జాలిపడి రకరకాలుగా చర్చించుకున్నారు. ఎందుకిలా అని ఎవరూ ఆఫీసరును అడగలేదు.

వాచ్‌మనూ, స్వీపరూ దిగాలు ముఖం పెట్టారు. అంతంత మాత్రం జీతంతో బతికే బతుకులకు ఆఫీసరు విధించిన జరిమానా అన్యాయమైనదని అందరికీ తెలును.

మర్నాడు నేను ఆఫీసరుగారితో అన్నాను: "ఫ్యాన్ పోవటానికి మేం ఎంతవరకు బాధ్యులము సార్!"

"మరెవరు బాధ్యులు?"

"ఆ విషయం తెలిస్తే ఈ గొడవంతా ఎందుకు సార్" అన్నాను.

"అందుకోసమే ఇలాంటి శిక్ష విధిస్తే మళ్ళీసారి జాగ్రత్తగా ఉంటారు" అన్నాడు.

"సార్! ఇంకేమైనా పోతే కూడా మేమే శిక్షింపబడాలా!"

నాది న్యాయమైన ప్రశ్న. ఆయన దగ్గర జవాబు లేదు.

అప్పటికి కోపాన్ని ప్రదర్శించి, "ఎవరితో మాట్లాడుతున్నావో తెలుస్తుందా?" కసిరాడు. నేను మౌనంగానే ఉన్నాను. "ఈ విషయంపై ఎక్కువ మాట్లాడాల్సిన అవసరం లేదు. గెటౌట్!" అరిచాడు.

చాలామంది పెద్దవాళ్ళు తాము సరైన జవాబు చెప్పి ఇరుకున పడాల్సివచ్చినపుడు పై విధంగానే ప్రవర్తిస్తారు.

మర్నాడు నేనే మొత్తం డబ్బును

> 'ఇంత తెలివి కలవాడివి, డిగ్రీ చదివినవాడివి ప్యూన్ ఉద్యోగం ఎలా చేస్తావ్' అన్నారు అధికార్లు. "ఏ హోదాలోనైనా అంతర్లీనంగా ఉండేది శ్రమే కదా' అన్నాను. నా మాటకు సంతృప్తిపడ్డారు."



తీసుకొచ్చి ఇచ్చాను. తాను స్వయంగా తీసుకోకుండా సూపరింటెండెంటు ద్వారా తతంగం నడిపించాడు. కనీసం డబ్బిచ్చేటప్పుడైనా ఆయనలో ఒక మానవుడు ఉద్భవిస్తాడని ఊహించాను. అదేమీ జరగకపోవడం నాలో తెగువను పెంచింది. ఆనాటి నుండీ నన్ను అదోరకంగా చూడ్డం మొదలుపెట్టాడు. చీటికీ మాటికీ అవసరం లేకున్నా చీవాట్లు పెట్టాడు- రాజు గారు తలచుకుంటే దెబ్బలకు కొదువా!

పోయి ఫ్యాన్ గురించి ఎంక్వయిరీ ప్రారంభించాను. ఫ్యాన్ పోయిన ముందు రోజు ఆఫీసు నుండి ఆలస్యంగా వెళ్ళిందెవరని వాచ్‌మన్‌ని అడిగాను. పని ఉందని ఆఫీసరుగారే చాలా సేపు ఉన్నాడని చెప్పాడు. "వెళ్ళేటప్పుడున్నావా" అన్నాను. ఉన్నానన్నాడు. "అంతకు ముందు ఎక్కడికైనా వెళ్ళావా" అన్నాను. సిగరెట్లు తెమ్మని పంపిస్తే బయటకు వెళ్ళానన్నాడు. ఎందుకో అనుమానం కల్గింది. నేనొక అవకాశం కోసం వేచి ఉన్నాను. ఆఫీసరు ఇంటి పరిసరాల్లో ఉన్న రెండు ఫ్యాన్ రిపేర్ షాపువాళ్ళతో పరిచయం పెంచుకొని నిఘా వేసి ఉంచాను. నాలో ఉన్న అనుమానం నన్నంత పని చేయించింది.

ఎక్కువ శ్రమపడకుండానే మనకు కావల్సింది అతి తొందరగా కొన్ని అద్భుత సందర్భాల్లో మాత్రమే జరుగుతుంది. వెతకబోయిన తీగ కాలికి తగిలిందన్న సామెత అలాంటి సమయాల్లోనే పుట్టి ఉంటుంది.

రెండు నెలల తర్వాత ఒక రిపేరు షాపు మిత్రుడు నన్ను త్వరగా కలవమని ఆఫీసుకు ఫోన్ చేశాడు. ఆ సాయంత్రమే కలిశాను. ఆ క్షణంలో నాకున్న ఓ చెడ్డ అలవాటు బాగా ఉపయోగపడింది. బస్సులో సీట్ల వెనకాల, లైబ్రరీ పుస్తకాలపైన, ఆఫీసు డోర్లపైన, బల్లలపైన నా పేరు వెంకట్రాంను పొడిగా VRగా రాయడం అలవాటు. మంచిది కాని అలవాటైనా, రాయలేకుండా ఉండటమొక బలహీనత. ఆ బలహీనతే కొత్త ఫ్యాన్‌పై స్టాండుకు వెనకాల VRను గుండుసూదితో గీచాను.

ఆ సాక్ష్యంతో, ఆఫీసరు ఇంటి నుండి రిపేరు కొచ్చిన ఆఫీసు ఫ్యాన్‌ను బాగుచేయించుకొని ఇంటికి తీసుకొచ్చుకున్నాను. షాపు వానితో మీ ఆఫీసు ఫ్యాన్‌ను పంపితే ఇచ్చేశానని చెప్పమన్నాను.

రెండు రోజుల తర్వాత విషయం తెల్సిన మా ఆఫీసరు కంటికి నేనొక సీబీఐ ఆఫీసర్‌ను.

నా ముందు తల ఎత్తటం లేదు.

నన్ను పిలవటం మానుకున్నాడు. నేను కంట్లో నలుసులా ఉన్నాను.

పక్కలో బల్లెంలా ఉన్నాను.

నన్ను చూస్తూ పాపాన్ని ఎలా భరించగలడు? ఆ కారణం చేత నన్ను బదలీ చేయించడానికి ప్రయత్నిస్తున్నట్లుగా తెలిసింది. నేను న్యాయం గురించి మాట్లాడి, ఆయన అన్యాయం గురించి తెలుసుకున్నాను.

ఈ రెండూ చాలు కదా నన్ను దూరంగా పంపించడానికి.

ఆయన ఏ పరిస్థితిలో అలా చేయాల్సివచ్చినా, మా నుండి నష్టపరిహారాన్ని వసూలు చేయకుండా ఉండాల్సింది.

ఎంతమంది ఆఫీసర్లు, ప్రభుత్వ ఉద్యోగులు ఎన్ని రకాలుగా ప్రభుత్వ ధనాన్ని భోంచేయటం లేదు? తుఫాను బాధితులకిచ్చే ఆర్థిక సహాయం నుండి బడిపిల్లలకు విజ్ఞానం చూపించమని ఇచ్చిన వీడియోలు, మాస్టార్లకి చూపిస్తున్న రక రకాల సినిమాల దాకా ఎన్ని సంగతులు బయల్పడటం లేదు. ఎన్ని కుంభకోణాలు బయట పడడం లేదు. అన్ని విషయాల్లోనూ నాలాంటి వాస్తవం. తెలిసిన మనిషిని బలివ్వకుండా ఊరుకుంటున్నారా! అది బదలీ కావచ్చు, ఆత్మహత్య కావచ్చు. ఇంకేదో ఓ రూపకంగా నాలాంటివాడికి సమర్పిస్తూనే ఉన్నారు కదా!

తమ బలహీనతలను, దొంగతనాలను కప్పిపుచ్చుకోవటానికి అధికార గణం విధించే శిక్షలకు నాలాంటి సామాన్యుడు తల వంచక తప్పదు.

మా ఆఫీసరు నన్ను బదలీ చేయించాలని పూనుకోవడం నాక్కూడా ఇష్టమే. ఇలాంటి అవినీతిపరుని కుర్చీపై రోజూ దుమ్మును దులపడం నాకు ఇష్టం లేదు.

బదలీపై వెళుతూ మా ఆఫీసరును అడగాలని ఓ ప్రశ్న సిద్ధంగా ఉంచుకున్నాను. "అక్రమ ఆర్జనలచే పోషింపబడే రక్తమాంసాలు, మనసూ సక్రమంగా ఉంటాయా" అని. ■

బీదలూ, హోదా లేనివాళ్ళు, కూలీపని చేసేవాళ్ళూ పక్కా దొంగలని గొప్పవాళ్ళ అభిప్రాయం. ఈ ఆఫీసరుకూ అలాంటి ఆలోచనే వచ్చి, "ఎలా జరిగినా మీరే భరించ"మని తీర్పు చెప్పాడు.